# అవర్ణ దీర్ఘ సంధి



కావాలని కూడితే – సుఖం
కాదు కూడదనుకుంటే–హింస
ఇష్టాయిష్టాల మధ్య కత్తి అంచులా ఎంత సన్నటి గీత!
నాకు తెలుసు
పోగొట్టుకోవడం ముగిశాకే పొందడం మొదలౌతుంది
రా!
ప్రేమ అనే ఖైదులోంచి ఖైదు అనే స్వేచ్ఛలోకి ప్రవహిద్దాం

* * *

నేలడయల్ మీద నువ్వు పెద్ద ముల్లు నేను చిన్నముల్లు
కోరిక మూడోముల్లై ఇద్దర్నీ సుతారంగా గుచ్చుకుంటూ పోతుంది
తలలు తెగవు నెత్తురు కారదు అయినా యిది యుద్ధమే
నెత్తురు చుక్కకు సిరాచుక్క పర్యాయమైన యుద్ధం
ఒక ఆహ్లాదకర యుద్ధ వాతావరణం గదంతా కమ్ముకుపోయి
ఇద్దర్నీ చెరో మంచం పట్టెకి దిగ్గొట్టి పోతుంది
ఊళ్ళో నువు!
వాడలో నేను!
అయినా–ఏవి ఎవరి పెదిమలో తెలీని తమకంలో
ఒకళ్ళని మరొకళ్ళలోకి తోడి పోసుకుంటాం
మృణ్మయ శరీరాలు మాట్లాడుకోడానికి మరో అంశమేదీ మిగలనప్పుడు
మౌనం ఒక్కటే మైక్రోఫోన్ అందుకోగల సాహసి

* * *

గుండె ముక్కలైనందుకు ఎవళ్ళని నిందించాలి
అద్దంలాంటి గుండెనిమ్మన్నది ఇందుకోసం కాదే!
ఇప్పుడు తెలుస్తోంది ఎంత లయబద్ధంగా ధ్వంసమైపోయానో
నీ ప్రేమ కానుకగా ఈ నెత్తుటి బొట్టొకటి మిగిలింది నాకు
ఎంత కసిగా వుందో నీ మీద!
తడిసిన కాగితంలాంటి నన్ను ఎంత విశ్శబ్దంగా చించేశావ్!
ఏయ్! నీలో నువ్వు ఎంత రహస్యంగానైనా దాక్కో
నిన్నిట్టే పట్టేసుకుంటాను
నీదొట్టి పారదర్శక చర్మం!

* * *

బాధాకరమే!
ఏదో సాధించాలన్న తపనలో
ఏమీ కాకుండానే బతుకును గడిపేయడం
బాధాకరమే!
అవసరంకొద్ది అలవాటుకొద్ది భయంకొద్దీ
రెండు మాంసపు సంచులు పక్క పక్కనే పడుకోవాల్సి రావడం
బాధాకరమే!
కోరికను బ్లేడుతో చివ్వీ చివ్వీ
ఒకళ్ళ శరీరంలోకి మరొకళ్ళు దూకుడుగా దిగబడ్డం
పాము ముంగిసల్లా మెలేసుకు పొర్లాడ్డం
బాధాకరమే
బుగ్గమీది ఎరుపు ఒకళ్ళకేమో సిగ్గు మరొకళ్ళకేమో నెత్తుటి చెమ్మ
ఎవరు పొరబడుతున్నట్టు?
పడక దుప్పటి విదిలించినప్పుడు రాలిన
నెత్తుటి మరకలో వీర్యపు చుక్కలో సంధివచనాలో
ప్రేమకు సంకేతాలు కావుకదా!
ఏడడుగుల బంధం ఏడంగుళాల సంబంధంగా సంకోచించడమో
ఏడెనిమిది నిమిషాల మూలుగులు వైవాహిక జీవితంగా వ్యాకోచించడమో
ప్రేమకు పర్యవసానం కాదుకదా
కాదు కాదు
మనుషులంటే–పగలు బట్టలేసుకు తిరిగే వాళ్ళు మాత్రమే కాదు
సంసారం అంటే–రాత్రిళ్ళు బట్టల్లేనితనపు వూగిసలాటొక్కటే కాదు

* * *

నేనుమాత్రం అనుకున్నానా
ఈ మట్టి వాసనకింద ఇన్ని స్పందనలు దాక్కున్నాయని
లెక్కలు తెలీక పోవడంతోనే వచ్చింది చిక్కంతా
ఎన్ని అడుగులేస్తే ప్రేమ పెళ్ళనిపించుకుంటుందో
ఎక్కడ నమోదైతే ప్రేమ చెంబులు తపేళాలుగా విరబూస్తుందో
ఈ లెక్కలేవీ నాకు రావు
తెలిసిన కాసిన్ని అంకెలూ తెల్లారని రాత్రుల్ని లెక్కించడానికే సరిపోవు
దొరికిన కాసిన్ని క్షణాలూ గడియారం చేసిన గాయాలకు కట్లు కట్టడానికే సరిపోవు
ఇన్నాళ్ళూ మనిద్దరం చెరొక సైన్యంగా విడిపోయి చచ్చిపోతున్నాం
బతుకంటే చావు అనే అర్థం ఎక్కడైనా వుందా?!

* * *

నన్ను పశువుగా మార్చినవాడు నాకు ఒక్క కొమ్మూ ఇవ్వలేదు
కుమ్మడానికి నాకు గొంతొక్కటే ఆయుధం–కానీ
గొంతును పాటకు పర్యాయం చేసినవాళ్ళకి జోహార్!
కాస్త ఇటు ఒత్తిగిల్లు
ఒకటి రెండు అవయవాలు లేవన్న వూహతో మానవ సృష్టి మొదలెడదాం
మానవుడికి మూలం మనువు కాదన్న నమ్మకంతో
కళ్ళని కొంచెం విప్పార్చు
చెరొక రెప్ప అడ్డేసి బతుకు కల చిట్లిపోకుండా కాపాడుకుందాం

– పైడి తెరేష్‌బాబు